క్లుప్తంగా

యువతకు అధిక ప్రాధాన్యం

శ్రీరంగరాజపురం: వైఎస్సార్‌ సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆ పార్టీ మండల యువత అధ్యక్షుడు జ్ఞానేంద్రరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామీణ ప్రాంతంలో వైఎస్సార్‌ సీపీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. యువతకు అధిక ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. వైఎస్సార్‌ సీపీ మండల యువత అధ్యక్ష పదవి రావడానికి కృషి చేసిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఇన్‌చార్జి కృపాలక్ష్మిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, మండల కన్వీనర్‌ మణి, నాయకులు ముత్తుగస్‌, జనార్దన్‌, వాసు, శేషాద్రి, బాబు తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్‌కు ఘన సన్మానం


బదిలీపై వెళ్లిన వెటర్నరీ అసిస్టెంట్‌ గోపిని సన్మానిస్తున్న పాడి రైతులు

పెనుమూరు(కార్వేటినగరం): గ్రామీణ పశువైద్యశాలలో లైవ్‌స్టాక్‌ సిబ్బందిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఆర్‌.గోపిని ఆదివారం సర్పంచ్‌ మురళీకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ మాట్లాడుతూ ఉగ్రాణంపల్లిలో వెటర్నరీ అసిస్టెంటుగా గోపి 7 సంవత్సరాల పాటు పాడి రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ మూగ జీవాలకు ఎనలేని సేవలు అందించారని, ఆయన సేవలను రైతులు ఎప్పటికీ మరచిపోరని కొనియాడారు. రాధాకృష్ణారెడ్డి, అర్జునరెడ్డి, రమణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోవిందరెడ్డి, పశు వైద్య సిబ్బంది సుదర్శన్‌రెడ్డి, నాగేంద్రబాబు, కిషోర్‌, రామ్మూర్తిరెడ్డి, భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రంవేడుకలు


అగరంపేటలో గ్రామంలో పీర్ల ఊరేగింపు

నింద్ర: మండలంలోని అగరంపేట గ్రామంలో ఆదివారం మొహర్రం పండుగ ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలో అగ్నిగుండ ప్రవేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను గ్రామంలో ఊరేగించారు. ప్రతి ఒక్కరు పీర్లకు పూజలు చేశారు. చావిడి వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పీర్లను దర్శించుకున్నారు. మహిళలు అగ్నిస్నానాలు చేపట్టారు. సాయంత్రం పీర్లను ఊరేగింపు సందర్భంగా యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్రమిత వ్యాధులున్నాయి.. జాగ్రత్త

- అప్రమత్తంగా ఉంటే వ్యాధుల నుంచి దూరం
- ఘనంగా జూనోసిస్‌ దినోత్సవం
- పశు వైద్యశాలలో వ్యాక్సినేషన్‌





నగరి: రైతు నుంచి పారిశ్రామిక వేత్తల దాకా ఏదో ఒక రూపంలో జంతువులతో సహవాసం చేస్తుంటారు. వ్యవసాయం, పాడి నిమిత్తం ఆవులను, వ్యాపార నిమిత్తం గొర్రెలను, మేకలను, పందులను, కోళ్లను, కుందేళ్లను పెంచుకుంటూ ఉంటారు. కొందరు ఇళ్లలో కుక్కలను, పిల్లులను సాకుతుంటారు. ఇదిగాక ఎవరికీ తెలియకుండా ఎలుకలు సావాసం చేస్తుంటాయి. జంతువుల కారణంగా సోకే వ్యాధులపై కూడా అవగాహన ఏర్పరుచుకొని జాగ్రత్త పడకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పశువుల నుంచి మానవులకు సంక్రమించే స్వభావం ఉన్నవ్యాధులు (జూనోటిక్‌ వ్యాధులు) సోకకుండా వ్యాక్సినేషన్‌ తప్పనిసరిగా చేయించుకోవాలి. అంతర్జాతీయ జూనోసిస్‌ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏడీ వాసు, శ్రీరంగరాజపురం వెటర్నరీ వైద్యాధికారి శ్రీవిద్య ఆధ్వర్యంలో ఆదివారం పెంపుడు కుక్కలు, ఇతర జంతువులకు యాంటీ ర్యాబిస్‌ ఇంజక్షన్లు వేశారు. జంతువుల నుంచి సోకే వ్యాధులివే...

పశువుల ద్వారా..
మశూచి, గాలికుంటు, రేబీస్‌, ఆంత్రాక్స్‌, లిస్టీరియోసిస్‌, బ్రూసెల్లోసిస్‌, క్యూ ఫీవర్‌, క్షయ, తామర, బెబీసియోసిస్‌, ఫైలేరియాసిస్‌, హైడాటిడోసిస్‌, ట్రిపనసోమియాసిస్‌, టాక్సోప్లాస్మోసిస్‌

కుక్కలు, పిల్లుల ద్వారా...
రేబీస్‌, లెప్టోస్పైరోసిస్‌, తామర, ట్రిఫనసోమియాసిస్‌, టాక్సోప్లాస్మోసిస్‌, లార్వామైగ్రాన్స్‌, కాట్‌ స్క్రాచ్‌ ఫీవరు

పందుల ద్వారా..
మెదడువాపు వ్యాధి, గాలికుంటు, ఇన్‌ఫ్లుయంజా, బ్రూసెల్లోసిస్‌, లెప్టోస్పైరోసిస్‌, లిస్టీరియోసిస్‌, సాల్మొనెల్లోసిస్‌, హైడాటిడోసిస్‌, తామర, ట్రైఖినెల్లోసిస్‌

కోళ్లు, పక్షుల ద్వారా..
ఇన్‌ఫ్లుయంజా, క్లమీడియోసిస్‌, లిస్టీరియోసిస్‌, సాల్మొనెల్లోసిస్‌, క్షయ, తామర సిట్టకోసిస్‌

గొర్రెలు, మేకల ద్వారా..
రేబీస్‌, ఆంత్రాక్స్‌, లిస్టీరియోసిస్‌, బ్రూసెల్లోసిస్‌, క్యూ ఫీవర్‌, సాల్మొనెల్లోసిస్‌, హైడాటిడోసిస్‌, టాక్సోప్లాస్మోసిస్‌, ట్రిపనసోమియాసిస్‌

ఎలుకల ద్వారా..
రోసిస్‌, ప్లేగు

నగరి పరిధిలో పశువుల వివరాలు

మూగజీవాలు	సంఖ్య
ఆవులు	22712
గేదెలు	1529
మేకలు	23989
గొర్రెలు	16063
మొత్తం	64293

జాగ్రత్తలు
- పశువులకు, పెంపుడు జంతువులకు తప్పనిసరిగా టీకా మందులు ఇప్పించాలి.
- వారానికి ఒకసారి స్నానం చేయించాలి, జూలు కుక్కలను ప్రతిరోజు దువ్వాలి.
- పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులు తాగించాలి.
- వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, ప్రతిదినం స్నానం చేయడం, గోళ్ళను ఎక్కువగా పెంచుకోకుండా ఉండటం, తినేముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి
- మరుగకాచిన పాలనే తాగటం, బాగా ఉడకబెట్టిన మాంసాన్నే తినాలి.
- వ్యాధిగ్రస్త జంతు మాంసం తినకూడదు.
- దగ్గు వచ్చినప్పుడు రుమాలును నోటికి అడ్డు పెట్టుకొని దగ్గాలి.
- చవకబారు ఐస్‌ క్రీములు తినకుండా ఉండాలి.
- చిలుకలు, పక్షులతో అతిసన్నిహితంగా మెలగకుండా ఉండాలి.
- చనిపోయిన పశువులను సున్నపు గుంటలలో లోతుగా పాతిపెట్టాలి.
- జంతువుల అనారోగ్య లక్షణాలను గమనించి పశువైద్యులను సంప్రదించాలి.

ముందస్తు జాగ్రత్త అవసరం



సంక్రమిత వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త తీసుకోవాలి. ఇది జంతువులకు, మనుషులకు ఎంతో ఉపయోగపడుతాయి. ప్రపంచ జూనోసిస్‌డేను పురస్కరించుకొని ఆదివారం పశు వైద్యశాల వద్ద ఉచిత టీకాలు వేస్తాం. జంతువులను పెంచుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యాక్సినేషన్‌ చేయించుకోవాలి.

\- డాక్టర్‌ వాసు, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, నగరి

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ


అపరంజిని సత్కరిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: పట్టణంలోని లక్ష్మీనగర్‌ కాలనీలోని బంగారయ్య రాయల్‌ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా ఆదివారం వారి ఇంటికెళ్లి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్‌ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశంసలు
స్థానిక ఎస్‌ఆర్‌ఎస్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన అపరంజిని మాజీ మంత్రి ఆర్కే రోజా సత్కరించారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ కాలనీలోని ఆయన ఇంటికెళ్లి ఆయన అందించిన సేవలను గుర్తుచేస్తూ ప్రశంసించారు.

సర్పంచ్‌కు మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శ
నింద్ర: మండలంలోని కేఆర్‌ పాళెం గ్రామ పంచాయతీ సర్పంచ్‌ గౌరిని ఆదివారం మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. వారం రోజుల క్రితం మోటార్‌ సైకిల్‌ ప్రమాదంలో ఆమె గాయపడ్డారు. తిరుపతిలో వైద్యశాలలో వైద చికిత్స పొంది, ఇంటికి రావడంతో ఆమెను మాజీ మంత్రి రోజా పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి, తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, జెడ్పీటీసీ పరంధామ, వేణురాజు, మునికృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బంగారయ్య కుటుంబంతో మాజీ మంత్రి ఆర్కే రోజా


సర్పంచ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి రోజా

బాధితులకు పరామర్శ


మోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, నేతలు

వెదురుకుప్పం: మండలంలోని కొండకిందపల్లె గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న వైఎస్‌ఆర్‌ సీపీ యువనాయకుడు మోహన్‌రెడ్డిని ఆదివారం మాజీ ఉప ముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి పరామర్శించారు. మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలపై వాకబు చేశారు. అదేవిధంగా అగ్గిచేనుపల్లె గ్రామంలో మునస్వామిని పరామర్శించారు. ఇటీవల అనారోగ్యం పాలవడంతో విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్‌ఆర్‌ సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రామయ్య, సర్పంచ్‌లు గోవిందయ్య, కుప్పయ్య(శ్రీరంగరాజపురం), మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు అనిల్‌, ధర్మయ్య, రమణ, రాజేంద్రరెడ్డి, ఎంపీటీసీ చిన్నబ్బ, దామోదర్‌రెడ్డి ఉన్నారు.

వైభవంగా విరూపాక్షమ్మ జాతర


ఆలయ ఆవరణలో పొంగళ్లు

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని దాసరిపల్లి గ్రామంలో వెలసి ఉన్న విరూపాక్షమ్మ జాతరను పురస్కరించుకుని ఆదివారం పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి అమ్మవారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి, చెక్క భజనలు, కోలాటాలు, జింగిరి మేళాలు, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారిని దాసరిపల్లి, పాపిరెడ్డిపల్లి, పెనుమూరు పరిసర గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే గ్రామంలో యువతను ఆకట్టుకునేలా పాట కచ్చేరి నిర్వహించారు. ఈ క్రమంలో భాగంగా మొక్కులున్న భక్తులు మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రేపు మెగా రక్తదాన శిబిరం


హేమంత్‌ రెడ్డి

గంగాధరనెల్లూరు: ఈ నెల 8వ తేదీ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి 76వ జయంతి సందర్భంగా వైఎస్సార్‌ సీపీ పిలుపు మేరకు యువజన విభాగం ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరు మండల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు యువజన విభాగం రీజినల్‌ కోఆర్డినేటర్‌ హేమంత్‌ రెడ్డి, నియోజకవర్గ యువత అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌ విగ్రహానికి నివాళులర్పించి, రక్తదాన శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, జీడీనెల్లూరు ఇన్‌చార్జ్‌ కృపాలక్ష్మి హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల యువజన విభాగం అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

నేడు రీకాలింగ్‌ బాబు మేనిఫెస్టో

పెనుమూరు(కార్వేటినగరం): మండల పరిధిలోని పులిగుండు వద్ద ఉన్న కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించే రీకాలింగ్‌ చంద్రబాబుస్‌ మేనిఫెస్టో క్యూఆర్‌ కోడ్‌ ఆవిష్కరణను విజయవంతం చేయాలని మండల వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌ సీపీ అధ్యక్షులు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన బాబు మేనిఫెస్టోపై ఇంటింటికీ వంచన అనే కార్యక్రమం ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, నియోజకవర్గం సమన్వయకర్త కృపాలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు అత్యధికంగా తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు


వ్యాక్సిన్లు వేస్తున్న వెటర్నరీ ఏడీ

నగరి: స్థానిక వెటర్నరీ ఆస్పత్రిలో పెంపుడు జంతువులకు ఆదివారం పలువురు పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లను వేయించుకున్నారు. వెటర్నరీ ఏడీ వాసు ఈ కార్యక్రమంలో పాల్గొని, జంతువులకు వ్యాక్సిన్లు వేశారు.

శ్రీరంగరాజపురం: పెంపుడు జంతువులకు టీకాలు వేసుకోవాలని మండల పశువైద్యాధికారి శ్రీవిద్య అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు అందిస్తున్నామన్నారు. అనంతరం తయ్యూరు పశువైద్య కేంద్రంలో పెంపుడు జంతువులకు టీకాలు వేశారు.

బాబు మోసాలను నిలదీద్దాం


క్యూఆర్‌ కోడ్‌పై వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం

- జగనన్న హయాంతో ప్రతి ఒక్కరికీ పథకాలు
- టీడీపీ నుంచి వైఎస్సార్‌ సీపీలోకి చేరికలు
- ఆహ్వానించిన డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, కృపాలక్ష్మి

పాలసముద్రం: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్‌ సిక్స్‌ హామీల అమలు చేయకుండా ప్రజలను మోసగించిన ప్రభుత్వాన్ని నిలదీయాలని డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, జీడీ నెల్లూరు ఇన్‌చార్జి కృపాలక్ష్మి తెలిపారు. ఆదివారం పాలసముద్రంలో మండల కన్వీనర్‌ తులసి యాదవ్‌, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్‌ సమక్షంలో వైఎస్సార్‌ సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలతో కలసి మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ పేరిట రూపొందించిన క్యూఆర్‌ కోడ్‌ను విడుదల చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ప్రదర్శించారు. కార్యకర్తల ఉద్దేశించి డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రసంగించారు. అబద్దాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు హామీలు అమలు చేయకుండా అందరినీ మోసగించారని దుయ్యబట్టారు. సూపర్‌ సిక్స్‌ హామీల పేరిట ఎన్నిల సమయంలో ఇంటింటికి బాండ్లు పంపిణీ చేశారని, అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకపోతే నిలదీయండంటూ చెప్పారన్నారు. సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి మన ప్రభుత్వం పేరిట వస్తున్న నాయకులను బాండ్లు తీసుకుని నిలదీయాలన్నారు. ఇందుకు ప్రజలు సన్నద్ధం చేయాలన్నారు. ప్రతి మండలంలో గ్రామ స్థాయిల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలి కోరారు. చంద్రబాబు చేసిన మోసాలను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. ఎలాంటి నిబంధనలు లేకుండా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని, ఇప్పుడు కొర్రీలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. తల్లికి వందనంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్‌ చేశారు. 19 నుంచి 59 సంవత్సరాల ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ మహిళలకు రూ.1500 ఇస్తామన్న హామీ ఏమైందంటూ ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో లక్షల కోట్లు అప్పులు తేవడంపై సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేసిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఇస్తామన్న భృతి ఏమైందని నిలదీశారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీలు శేఖర్‌ యాదవ్‌, పుష్పాప్రకాష్‌, సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, అనురేఖ, మహేష్‌ బాబు, అయ్యప్ప. జీవిత, నరసింహులురాజు, ఎంపీటీసీలు గోవిందరాజ్‌, లిఖిత, నియోజకవర్గ బీసీ సెల్‌ అధ్యక్షుడు ధనుంజయులు, నాయకులు పుత్తూరు కేశవరెడ్డి, సుందరరాజు, షణ్ముగరెడ్డి, ఆనందన్‌, ప్రకాష్‌, అరుల్‌, చలయ్య, ధనపాల్‌, రాజీకమల్‌, శేఖర్‌, ఆనస్టిరాజ్‌, రజిని, వెంకటేష్‌, వేణు, మదు, రామూర్తి, చంద్రకుమార్‌, షణ్ముగరెడ్డి, పద్మనాభనాయుడు, రవిరెడ్డి, సురేష్‌, ఇలయరాజ్‌, విష్ణు, ఆరుముగం, భాస్కర్‌, పోలయ్య, వరదరాజు, జనార్ధననాయుడు, రమాదేవి, గోపాల్‌, జిల్లా అధికార ప్రతినిధి కోదండన్‌, ఉమ్మడి జిల్లా బూత్‌ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి, ఎస్‌ఆర్‌ పురం మండల కన్వీనర్‌ మణి, జీడీ నెల్లూరు వైస్‌ఎంపీపీ హరిబాబు, ఎస్‌ఆర్‌ పురం ఎంపీపీ జనార్ధన్‌ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి చేరికలు
మండలంలోని ఆముదాల పంచాయతీ శేషాద్రి యాదవ్‌, మోహన్‌ యాదవ్‌, నాగరాజ్‌ యాదవ్‌, ప్రసాద్‌ యాదవ్‌, సింహరాజుపురం పంచాయతీ ఏలుమలై, గోవిందరాజ్‌, ఏకాంబరం, పాలసముద్రం బీసీ కాలని హేమాద్రి యాద వ్‌, 30 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌ సీపీలో చేరారు. టీడీపీ నాయకులను జీడీ నెల్లూరు ఇన్‌చార్జి కృపాలక్ష్మి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి



సమావేశంలో మాట్లాడుతున్న భూమన, మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: ప్రజలను మోసం చేసి మంచి ప్రభుత్వం అంటున్నారని, ఈ కార్యక్రమానికి పెట్టే కోట్ల ఖర్చు ప్రజలకు వెచ్చించినా కొంతైనా మేలు జరిగేదని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆదివారం నగరిలోని తన నివాస కార్యాలయం వద్ద నిర్వహించిన ‘రీకాలింగ్‌ చంద్రబాబు మేనిఫెస్టో’ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డిని తిట్టడానికి, తప్పు అని ప్రశ్నించిన వారిని తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయడానికే పని చేస్తోంది తప్ప ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. జగనన్న మిర్చి రైతుల వద్దకు వెళతానంటే వారిపై రివ్యూ జరుగుతోందని, పొగాకు రైతులకు వద్దకు వెళతానంటే వారిపై చర్చిస్తామని, నేడు మామిడి రైతుల వద్దకు వస్తానని చెప్పడంతో మద్దతు ధరపై రివ్యూలు జరుగుతున్నాయన్నారు. జగనన్న వెళతానంటేనే చంద్రబాబు దృష్టికి సమస్యలు వెళతాయన్నారు. స్వంత జిల్లాలో మామిడిరైతులకు అన్యాయం జరగడం తెలియకపోవడానికి మించిన దౌర్భాగ్యం మరొకటి లేదన్నారు.

గాలి మాటలు మాట్లాడుతున్నారు
గాల్లో గెలిచిన ఎమ్మెల్యేలు గాలి మాటలు మాట్లాడుతున్నారన్నారు. రైతులు సంక్షేమంగా ఉన్నారని డప్పులు కొడుతున్నారని, మామిడి మండీల వద్దకో, ఫ్యాక్టరీల వద్దకో వస్తే వారి కష్టాలు తెలుస్తాయన్నారు. రీకాలింగ్‌ చంద్రబాబు మేనిఫెస్టో ద్వారా మోసాన్ని ఎండగట్టాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నగరి: ఏకాంబరకుప్పానికి చెందిన కౌన్సిలర్‌ భూబాలన్‌ పెద్దనాన్న గణేష్‌ ఇటీవల మృతి చెందారు. ఆదివారం మాజీ మంత్రి ఆర్కే రోజ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే నగరి రూరల్‌ మండలం కృష్ణారామపురం ఎస్టీ కాలనీకి చెందిన మాజీ సర్పంచ్‌ రుద్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శ్యామ్‌ప్రసాద్‌ ముఖర్జీకి ఘన నివాళి

నగరి: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో డాక్టర్‌ శ్యామ్‌ప్రసాద్‌ ముఖర్జీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలదండలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులుగా నియమితులైన రామ్మూర్తి యాదవ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం

కార్వేటినగరం: శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం అగ్నిగుండం ప్రవేశంతో వైభవంగా ముగిసింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు కర్పూర హారతులు పట్టారు. అదేవిధంగా మహిళలు అమ్మవారికి పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం కంకణాలు ధరించిన భక్తులు కుమారగిరి సమీపంలో ఉన్న స్కంధ పుష్కరిణిలో స్నాన మాచరించి పసుపు వస్త్రాలతో చేతిలో వేపాకులు పట్టి అమ్మవారితోపాటు ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి అర్చకులు అగ్గితో కూడిన వడిబాల కట్టి అమ్మవారు విగ్రహం అగ్నిగుండంలో ప్రవేశించగా భక్తులు కూడా ఆమెతోపాటే అగ్ని గుండంలో దిగారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ఆవరణలో కిటకిటలాడింది. అగ్నిగుండ ప్రవేశానికి బలిజ కులస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రవియాదవ్‌, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రాజు, ఉపాధ్యక్షుడు కట్ల రవిరెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి, ఉప కోశాధికారి సాయిరాయల్‌, అర్చకులు సుమన్‌యాదవ్‌, బాబు ఆచారి, కుమారాచారి తదితరులు పాల్గొన్నారు.


కార్వేటినగరంలో అగ్నిగుండ మహోత్సవం